అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
సోమవారం 09 జనవరి 2023

బడిబయటి పిల్లల కోసం సర్వే

నవతెలంగాణ-గాంధారి

బడి బయటి పిల్లల గుర్తింపు కోసం సర్వే కొనసాగుతోంది. ఎఎస్‌సీ సర్వేలో భాగంగా ఆదివారం రాంపూర్ గడ్డ గ్రామంలో సర్వే నిర్వహించినట్టు తెలిపారు. బడిమానేసి ఇంట్లోనే ఉంటున్న పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భారతి, సత్యనారాయణ, సీఆర్పీ షాహిద్ తదితరులు ఉన్నారు.


సర్వే చేపట్టిన ఉపాధ్యాయులు, సీఆర్పీ

కాలేజీ స్థలాన్ని కాపాడాలి

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భూములను కాపాడాలని పూర్వ విద్యార్థులు కోరారు. ఇటీవల ఆక్రమణకు గురై పలువురు గుడిసెలు వేసుకోగా.. ఆదివారం వారితో మాట్లాడి కాలేజీ స్థలం నుంచి తొలగించుకోవాలని సూచించారు. ఇదే విషయమై తహసీల్దార్, డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. ప్రభుత్వ కాలేజీకి మొత్తం ఐదెకరాల భూమి ఉందని, సర్వే చేపట్టి హద్దులు పాతి స్థలాన్ని ఆక్రమణలకు గురికాకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులైన న్యాయవాది నారాయణ, చిలుక శ్రీనివాస్, వార్డు మెంబర్లు రాజారాం రమేష్, నరేశ్ ,లక్ష్మణ్ ,శరత్ పలువురు పాల్గొన్నారు.


కాలేజీ స్థలంలో నిర్మాణాలు పరిశీలిస్తున్న పూర్వవిద్యార్థులు


రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశమైన రైతులు

మాస్టర్‌ప్లాన్
రద్దు చేసే వరకూ పోరు

- భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించిన ఐక్య కార్యాచరణ కమిటీ
- నేడు కౌన్సెలర్‌లకు వినతి.. 11న మున్సిపల్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-సదాశివనగర్

మాస్టర్ ప్లాన్ రద్దు చేసే వరకూ పోరుబాటలో ఉంటామని రైతులు స్పష్టం చేశారు. ఆదివారం కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం అడ్లూరు ఎల్లారెడ్డిలో రైతుల ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో రైతుల అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ మీడియా సమావేశాలపై రైతులు చర్చించారు. ప్రభుత్వం నుండి సరైన సమాధానం వచ్చే వరకు పోరాటాన్ని ఆపేది లేదని రైతుల నిర్ణయించుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో భూములు కోల్పోవడానికి వీలులేదని నేడు (సోమవారం) ప్రతి కౌన్సిలర్ ఇంటికి పోయి వినతిపత్రం ఇవ్వాలని తీర్మానం చేశారు.

అదేవిధంగా ఈ నెల 11వ తేదీన అభ్యంతరాలకు ఆఖరి తేదీ రోజు కాబట్టి అదే రోజు మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టడానికి తీర్మానం చేశారు. అప్పటికి కూడా ప్రభుత్వం నుండి స్పష్టత రాకపోతే తర్వాత రైతుల ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో భవిష్యత్తు కార్యాచరణను తెలుపుతామని అన్నారు.

నేడు విద్యుత్‌సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా నేడు(సోమవారం) పట్టణంలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొననున్నట్టు డీఈ సాలియ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కామారెడ్డి పట్టణంలోని కాకతీయ నగర్ సబ్‌స్టేషన్, హౌసింగ్ బోర్డ్ సబ్ స్టేషన్ పరిధిలో గల కాలనీలైన హౌసింగ్ బోర్డ్ కాలనీ, దేవునిపల్లీ, విద్యానగర్, కాకతీయ నగర్‌తో పాటు నరసన్నపల్లి, రాజంపేట్, చిన్నమల్లారెడ్డి సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొనునున్నట్టు తెలిపారు. పై సబ్ స్టేషన్‌లలోని రైతు లకు ఉదయం 3 గంటల నుండి 3 ఫేస్ సప్లయ్ ఇవ్వనున్నట్టు తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అనుమతులు లేకున్నా..
అడుగడుగునా ఇటుకబట్టీలు

- ఉచిత సాగు కరెంట్ వినియోగం
- మామూలుగా తీసుకుంటున్న పలు శాఖల అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి

నవతెలంగాణ-లింగంపేట్





జిల్లా వ్యాప్తంగా భవన నిర్మాణ రంగం పుంజుకోవడంతో ఇటుకలకు డిమాండ్ ఏర్పడింది. దీన్ని క్యాష్ చేసుకునేందుకు పలువురు నిర్వహకులు యథేచ్ఛగా ఇటుక బట్టీలను ఏర్పాటు చేస్తున్నారు. తీటుక బట్టీలు ఏర్పాటు చేసేందుకు గనులు, కార్మిక, రెవెన్యూ, ట్రాన్స్‌కో, అటవీ శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, రవాణా శాఖ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. నిర్దేశించిన ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఇవేమీ పట్టించుకోకుండా ఇష్టానుసారంగా ఇటుక బట్టీలను ఏర్పాటు చేస్తూ అటు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ.. అనుమతులు లేకుండానే ఏర్పాటు చేస్తుండటంతో అటు కాలుష్యానికి కారకులవుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖల అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారని, మామూలుగా తీసుకుంటున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తనిఖీలు చేపట్టి అక్రమంగా ఏర్పాటు చేసిన ఇటుక బట్టీల నిర్వహకులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వర్షాకాలం ముగియడంతో ప్రస్తుతం ఇటుక బట్టీల ఏర్పాటు శరవేగంగా కొనసాగుతోంది. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా సుమారు 200 వరకు ఇటుక బట్టీలు ఏర్పాటు అయినట్టు సమాచారం. కానీ అనుమతులు మాత్రం కేవలం 30 మంది మాత్రమే తీసుకున్నట్టు తెలిసింది. జిల్లావ్యాప్తంగా ఆయా గ్రామాలలో భవన నిర్మాణరంగం పుంజుకోవడంతో.. దీన్ని ఆదునుగా తీసుకొని అడుగడుగునా అనుమతులు లేకుండానే అక్రమంగా ఇటుక బట్టీలు యథేచ్ఛగా ఏర్పాటు చేస్తున్నారు. సంబంధిత శాఖలకు చెందిన అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని మామూళ్ల మత్తులో తుల్లుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు బేకాతరు చేస్తూ అడుగడుగునా విచ్చలవిడిగా ఇటుక బట్టీలు ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక అధికారులను, ప్రజా ప్రతినిధులను అడ్డుపెట్టుకొని ఎలాంటి అనుమతులూ లేకుండానే ఇటుక బట్టీలు నడిపిస్తున్నారు. ఇటుక బట్టీల వలన కాలుష్యం పర్యావరణం కు పెనుముప్పు వాటిని అవకాశం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లక్షల్లో వ్యాపారం

ఇటుక బట్టీలు లక్షల్లో వ్యాపారం చేస్తున్నా. ప్రభుత్వానికి మాత్రం ఎలాంటి రుసుము చెల్లించడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఒక్క ఇటుక 6 రూపాయల నుంచి 8 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. వర్షాకాలం ముగియడంతో ప్రస్తుతం 8 నెలల పాటు ఇటుక బట్టీల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరుజిల్లనుంది. కొన్ని గ్రామాల్లో ఎల్లారెడ్డి కామారెడ్డి ప్రధాన రహదారి పక్కనే ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నా సంబంధిత జిల్లా స్థాయి అధికారులు సైతం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అనుమతులు లేకుండానే నిర్వహణ

ఇటుక బట్టీలు నిర్వహించాలంటే సంబంధిత శాఖల అధికారుల అనుమతి తప్పనిసరి. అందుకాను గనుల శాఖకు దరఖాస్తు చేసుకుంటే 16 వేల రూపాయలు చెల్లించాల్సి ఉంది. ఈ నిబంధన గతేడాది ఏప్రిల్ నుండి అమలులోకి వచ్చింది. అదేవిధంగా ఇటుక బట్టలు నిర్వాహకులు స్వయంగా బోరు మోటర్ ఉన్న డీడీలు చెల్లించాల్సి ఉంది. ఇప్పటివరకు ఎవరు చెల్లించిన దాఖలాలు లేవు. అటవీశాఖ కాలుష్య నియంత్రణ శాఖ రవాణా శాఖ ఆయా శాఖల అనుమతులు లేకుండానే ఇక బట్టీలు నిర్వహిస్తున్నట్టు సమాచారం. కొన్నిచోట్ల వ్యవసాయానికి ఉచితంగా సరఫరా చేస్తున్న విద్యుత్తును వాడుకుంటున్నారు. ఇతర రాష్ట్రాలైన బీహార్ మహారాష్ట్ర చత్తీస్గఢ్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుండి కూలీలను తీసుకొస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి కూలీలను రప్పించుకున్న అనుమతి తప్పనిసరిగా ఉండాలి. వీటికి కార్మిక శాఖ అనుమతి తప్పనిసరి. అయినప్పటికి అవేమీ పట్టడం లేదు.

శాఖలలో లోపించిన సమన్వయం.. ప్రభుత్వ ఆదాయానికి గండి

ఆయా శాఖలో అధికారుల మధ్య సమన్వయం లోపించడంతో ప్రభుత్వ ఆదాయానికి పెద్ద మొత్తంలో గండి పడుతుంది. ఆయా శాఖల అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోకపోవడంతో ఇటుక బట్టీలు యథేచ్ఛగా అనుమతులు లేకుండానే కొనసాగుతున్నాయి. మరోవైపు కొన్ని శాఖల అధికారులు గుట్టుచప్పుడు కాకుండా ముడుపులు తీసుకుంటూ చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆకస్మిక తనిఖీలు చేపట్టి.. అనుమతులు లేకుండా కొనసాగుతున్న ఇటుక బట్టీల వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా వాసులు డిమాండ్ చేస్తున్నారు.

నోటీలు జారీ చేస్తాం
నర్సారెడ్డి. గనుల శాఖ ఏడి

జిల్లాలో అక్రమంగా అనుమతి లేకుండా వ్యక్తిగత ఇటుక బట్టీలు నిర్వహిస్తున్న వారికి నోటీసులు జారీ చేస్తాం. దరఖాస్తు చేసుకున్నాకే అనుమతులు వచ్చిన తర్వాత ఇటుక బట్టీలు ఏర్పాటు చేసుకోవాలి. ఇప్పటికే కొంతమందికి నోటీసులు జారీ చేశాము. తనిఖీలు చేపట్టి శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం.

ఏండ్ల నాటి కల నెరవేరింది

నవతెలంగాణ-సిరికొండ


పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

మంచినీటి సమస్యతో సతమత మవుతున్న సిరికొండ వాసుల ఏండ్ల నాటి కల నెరవేరినట్ట యిందని సర్పంచ్ యెన్నం రాజారెడ్డి అన్నారు. ఆదివారం మంచినీటి పైప్‌లైన్ పనులను ప్రారంభిం మాట్లాడారు. గ్రామంలో తాగునీరు సమస్య అధికంగా ఉందని రూరల్ ఎమ్మెల్యే, టీఎస్ ఆర్టీసీ చెర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్ దృష్టికి తీసుకెళ్లగా ప్రజల ఆకాంక్ష మేరకు మంచినీటి పైప్ లైన్ మంజూరు చేసినట్టు తెలిపారు. తమ గోడు విని తాగు నీటి వసతి కోసం నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు సంతోష్ రెడ్డి, వార్డుసభ్యులు ముషీర్, రామస్వామి, గౌస్ బాషా, రాములు, ఎంపిటిసి కిషన్ పాల్గొన్నారు.

సదరమట్ ప్రాజెక్టుకు నీటి విడుదల

- ఎస్సారెస్పీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-మెండోరా

శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నుంచి సదర్‌మట్ ప్రాజెక్టు ఆయకట్టుకు ఆదివారం నీటిని విడుదల చేసినట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం చక్రపాణి తెలిపారు. కావున గోదావరి నది పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేపలు పట్టేవారు, పశువుల కాపరులు, రైతులు, ఇతరులు గోదావరి నదిలోకి వెళ్లకూడదని హెచ్చరిక జారీ చేశారు. గోదావరి వరద గేట్ల నుంచి తొలుత వంద క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా.. క్రమంగా 500 క్యూసెక్కులకు పెంచనున్నట్టు తెలిపారు.


ఎస్సారెస్పీ ప్రాజెక్టు

నిలకడగా ఎస్సారెస్పీ నీటిమట్టం

ఉత్తర తెలంగాణ వర ప్రదాయిణి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటి మట్టం నిలకడగా ఉంది. ఎస్సారెస్పీ పూర్తి స్థాయి నీటిమట్టం 1091 అడుగులు(90.3 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1087.7 అడుగుల(75.465 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు. గతేడాది ఇదే రోజు 1089.4 అడుగుల (81.69 టీఎంసీల) నీరు నిల్వ ఉంది. కాలువలకు, ఎత్తిపోతల పథకాలకు, మిషన్ భగీరథకు కలిపి రోజుకు సగటు సుమారు 8000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

మాస్టర్‌ప్లాన్‌పై
మాట కూడా చెప్పలే..

- ప్రజాభిప్రాయ సేకరణ గాలికి
- కేంద్ర మార్గదర్శకాలు బేఖాతరు
- కామారెడ్డిలో ముదిరిన వివాదం
- రైతు ఐక్యకార్యాచరణ కమిటీ భేటీ
- 11న మున్సిపల్ కార్యాలయం ముట్టడికి తీర్మానం

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



కామారెడ్డి మాస్టర్‌ప్లాన్‌పై రగడ కొనసాగుతోంది. ప్రతిపాదిత మాస్టర్‌ప్లాన్ రద్దు చేసే వరకూ ఉద్యమం కొనసాగించాలని రైతు ఐక్యకార్యాచరణ కమిటీ తాజాగా నిర్ణయించింది. ఈ మేరకు ఆదివారం భేటీ అయ్యింది. ఈ నెల 11వ తేదీన కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ముట్టడించాలని నిర్ణయించింది. కాగా మాస్టర్‌ప్లాన్ రూపకల్పనలో కనీస మార్గదర్శకాలు పాటించలేదని స్పష్టమయ్యింది. ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టకుండానే మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. ఈ విషయమై బాధిత రైతులను సంప్రదించగా.. తమకు కనీస సమాచారం కూడా లేదని వాపోతున్నారు. మొత్తం 15,209 ఎకరాలతో కామారెడ్డి మాస్లర్‌ప్లాన్ ముసాయిదాను మున్సిపల్ అధికారులు విడుదల చేశారు. ఇందులో పారిశ్రామిక జోన్ కోసం ఏకంగా 1,195 ఎకరాలు, వాణిజ్య జోన్ 551 ఎకరాలు ప్రతిపాదించారు. అయితే పారిశ్రామిక జోన్ కోసం వ్యవసాయ భూములను సేకరిస్తున్నారని రైతులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు.

రెండుగా చీలుతున్న ఊరు

- వీడీసీలో క్యాషియర్ పదవి కోసం పట్టుబట్టిన రెండు వర్గాలు
- కుదరకపోవడంతో వేర్వేరు కమిటీల ఏర్పాటుకు నిర్ణయం
- రెండు వర్గాలకు సపరేటు మటన్, చికెన్, బెల్టు షాపులు
- గ్రామంలోని వీడీసీ ఆస్తులూ పంపిణీ
- చట్టాన్ని చేతులోకి తీసుకుంటున్న వెల్మల్ పెద్దలు?
- కలెక్టర్, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి చొరవ తీసుకోవాలని కోరుతున్న వెల్మల్ గ్రామస్తులు

నవతెలంగాణ-నందిపేట్

"ఇదేలే తరతరాల చరితం.. జ్వలించే జీవితాల కథనం. పగేమో ప్రాణమయ్యేరో.. ప్రేమలే దూరమయ్యేనా.. నిరాశే నింగి కెగేసేనా.. ఆశలే రాలి పోయేనా.." ఓ సినీ గేయం నందిపేట్ మండలం వెల్మల్ వాసుల తీరుకు అద్ద పడుతోంది. అచ్చం అలాగే వెల్మల్ గ్రామంలో రెండు వర్గాల సామాజిక ప్రజలు నిత్యం ఏదో ఒక విషయంలో విబేధాలు తెచ్చుకుంటు ప్రేమ ఆప్యాయతలు లేకుండా సెగలు పొగలు రంజుకుంటునే ఉన్నాయి.

అసలు ఏం జరిగిందంటే..

నందిపేట్ మండలం వెల్మల్ గ్రామంలో సుమారు పదివేల జనాభా నివసిస్తుంది. తరతరాలుగా గ్రామాభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసుకొని గ్రామ అభివృద్ధి కోసం, ఊరి యోగక్షేమాల కోసం పాటుపడుతున్నారు. రాను రాను ఆ కమిటీ కాస్త రణరంగంగా మారుతోంది. ప్రతి ఏడాదిలానే ఈసారి కూడా గ్రామాభివృద్ధి కమిటీని ఎన్నుకునే సమయంలో అసలు కథ మొదలైంది. గ్రామంలో రెండు వర్గాల కుల పెద్దలు ఇందులో సభ్యులుగా ఉంటారు. ఓ వర్గానికి చెందిన కుటుంబాలు 400 ఉంటాయి. మిగతా కులాలకు చెందిన కుటుంబాలు 1300 వరకు ఉంటాయి. ఇందులోంచి మున్నూరుకాపు వర్గానికి చెందిన 8 మంది కుల పెద్దలు, మిగతా కులాల వర్గానికి చెందిన 10 మంది కుల పెద్దలను ఎన్నుకొని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులుగా ఏర్పడుతారు. రెండు కులాల పెద్ద మనుషులలో ఇద్దరు విలేజ్ క్యాషియర్‌గా మున్నుకాపు వర్గం నుంచి ఒకరు, ఇతర వర్గానికి చెందిన మరొకరిని ఎన్నుకొని ఇద్దరినీ నియమిస్తారు. అయితే మున్నూరుకాపు వారికి ప్రతేడాదీ క్యాషియర్ పోస్టు వస్తుండగా.. ఇతర కులాల వారికి ఆ పోస్టు వచ్చేందుకు సుమారు పది పన్నేడేండ్ల సమయం పడుతోంది. దీంతో ఈసారి క్యాషియర్ పోస్టులు మున్నూరుకాపు వారికి ఇవ్వకుండా ఇతర కులాల వారికి అవకాశం ఇవ్వాలని పలువురు పట్టుబట్టారు. ఇతర కులస్తుల పంత వర్గీయులు తమ సంఖ్యా బలం ఎక్కువ ఉందని, ఈసారి ఇతర కులస్తుల నుంచి ఇద్దరు క్యాషియర్‌లను నియమించాలనే ప్రతిపాదన ముందుకు తీసుకురావడంతో రెండు నెలలుగా గ్రామంలో గంభీర వాతావరణం నెలకొంది. చర్చోపచర్చలు చేపడుతూ వచ్చారు. చివరకు రెండు కమిటీలను ఏర్పాటు చేసేందుకు సిద్ధమైయ్యారు. ఈ క్రమంలో ఊరిలోని వీడీసీ ఆస్తులను, సొసైటీని, గ్రామంలో ఉన్న వ్యాపార సముదాయాలను, ఊరి గుట్టల పంపకాలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. పరిస్థితి ఇలానే కొనసాగితే రానున్న రోజుల్లో మరింత కులాల మధ్య విబేధాలు పెరిగి పెద్దలు, యువకులు తన్నుకునే పరిస్థితి నెలకొనే ప్రమాదం ఉందని గ్రామస్తులు వాపోతున్నారు.


సమావేశమై చర్చిస్తున్న గ్రామస్తులు

మున్నూరుకాపు వర్గానికి చెందిన ఇళ్లలో ఉండొద్దు

గ్రామంలో అంతకలిసి మెలసి ఉన్న సమయంలో ఒక్కసారిగా గ్రామం రెండుగా చీలి పోవడంతో అగ్గిరాజుకుంటోంది. మున్నూరుకాపు ఇళ్లలో ఉపాధి నిమిత్తం చిన్న చిన్న వ్యాపారాలు నడుపుతున్న వారిని సైతం 20 రోజుల్లో కాలి చేయమని మున్నూరుకాపు వర్గ పెద్దలు ఆదేశించారు. దీంతో వీరు ఏం చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. అసలు గ్రామాభివృద్ధి కమిటీ లేకుండా చేస్తానే ఊరు బాగుంటుందని గ్రామంలో ఉన్న ప్రజాలంతా భావిస్తున్నారు.


ఓ వర్గం వారి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు అయిన మాంసం దుకాణం


వెల్మల్ గ్రామ ముఖచిత్రం

ఎవరికీ వారే యమునా తీరే

రెండు వర్గాల మధ్య విబేధాలు రావడంతో ఎవరిదీ వారు చాకలి , మంగలి, చికెన్ ,మటన్, బెల్టు షాపులను ఏర్పాటు చేసుకున్నారు. నియమ నిబంధనలు పాటించకపోతే 10 వేల జరిమానా విధిస్తామని ఎవరిది వారు కట్టడి చేసుకున్నారు. యాసంగి పనులు ప్రారంభం కావడంతో ఎవరిది వారు కూలీలను పిలుచుకొని వరి నాట్లు వేసుకుంటున్నారు. రాను రాను పరిస్థితి ఎక్కడివరకు పోతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

అధికారులు జోక్యం చేసుకోవాలి

గత రెండు నెలలుగా గ్రామంలో రెండు వర్గాల మధ్య రచ్చ జరుగుతోంది. కాలం మరోతున్నప్పటికి ప్రజల మధ్య వారి ఆలోచన మాత్రం మరడంలేదు. ఓ విలీజ్ పదవి కోసం ఇలా రెండు వర్గాల కుల పెద్దలు విడిపోవడం మానసిక వేదన గురిచేస్తోందని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాభివృద్ధి కమిటీ వ్యవస్థను పూర్తిగా రద్దు చేయాలని లేదా అవగాహన కల్పించాలని కోరుతున్నారు. ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, కలెక్టర్ చొరవ తీసుకొని రెండు వర్గాల సామాజిక ప్రజల పిలిపించుకోని రెండుగా విడిపోయిన వెల్మల్ గ్రామాన్ని ఒక్కటి చేయాలని గ్రామస్తులు చేతులు జోడించి వేడుకుంటున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత


సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేస్తున్న జడ్పీటీసీ

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రానికి చెందిన హీనా బేగంకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన 60 వేల రూపాయల చెక్కును ఆమె భర్త మహమ్మద్ హాజికి జడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితురాలు ఇటీవలి కాలంలో అనారోగ్యానికి గురికావడంతో వైద్య నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకోవడంతో మంజూరైన చెక్కును అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాసవి రమేష్ , ఉప సర్పంచ్ ఇబ్రహీం , మాజీ కో ఆప్షన్ మెంబర్ షేక్ కరీం తదితరులు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
2
సోమవారం 09 జనవరి 2023

కందకుర్తి చెక్ పోస్ట్ వద్ద పోలీస్ తనిఖీలు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి చెక్‌పోస్ట్ వద్ద నాకాబందీ తనిఖీలు నిర్వహించినట్లు ఎస్ఐ పండ్ల సాయన్న తెలిపారు. మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలను తనిఖీలు చేశారు. వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను వారు పరిశీలించారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణకు వచ్చే వాహనాలను తనిఖీ చేశామన్నారు.



రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు గురుకుల పాఠశాల విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-ఆర్మూర్

గత డిసెంబర్ 29వ జిల్లా జూనియర్ మెన్ ఉమెన్ హ్యాండ్ బాల్ సెలక్షన్స్ నిర్వహించగా చక్కటి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు సి.హెచ్. దిలీప్ ఎంపిక అయినట్టు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గారెడ్డి ఆదివారం తెలిపారు.. ఈనెల 9న ఖమ్మం జిల్లాలోని సర్దార్ పటేల్ స్టేడియం నందు జరగబోయే 44వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ . శ్రీధర్. వ్యాయామ ఉపాధ్యాయులు రాజేందర్. అర్జున్. పాఠశాల కళాశాల నాన్ టీచింగ్ స్టాఫ్ దిలీప్‌ను అభినందించారు.

క్రిమినల్ కేసుల్లో

బాధితులకు న్యాయం చేద్దాం



నవతెలంగాణ-కంఠేశ్వర్

నేరాలను దర్యాప్తు చేసే సందర్భాల్లో ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వరాదని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ మహమ్మద్ రహీమోద్దీన్, భూసారపు రాజేష్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాలమేరకు జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవ సదన్‌లో నిర్వహించిన"న్యాయ సమస్యలు, కోర్టు ప్రొసీడర్స్,న్యాయ సంబంధిత విషయాలు" అనే అంశంపై పోలీస్ స్టేషన్ల హౌస్ అధికారులు, కోర్టు డ్యూటీ అధికారులకు అవగాహన కల్పించారు. ఒక నేరం జరిగిన వెంటనే ప్రాథమిక విచారణ నివేదికను రూపొందించుకున్న అనంతరం కేసుకు సంబంధించిన సమస్త నేర విచారణను ప్రతికోణం నుండి పరిశోధించాలని తెలిపారు. సమగ్రమైన అభియోగ పత్రాన్ని సంబంధిత కోర్టులో సమర్పించాలని సూచించారు. నేర స్థలపరిశీలన, ఫిర్యాదుదారు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు క్రమపద్ధతిలో, ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని అన్నారు. నేరానికి ఉపయోగించిన వస్తువులను స్వాధీన పర్చుకునే సందర్భంలో ఒకటికి పదిసార్లు పరిశీలించి భద్రపరచుకుని కోర్టులో డిపాజిట్ చేయాలని, అవి కోర్టు విచారించే సమయంలో నేర న్యాయ విచారణకు ఉపయోగ పడతాయని తెలిపారు. క్రిమినల్ నేరాల్లోని బాధితులకు న్యాయం అందించడంలో కర్తవ్య నిర్వహణను మరచిపోవద్దని పేర్కొన్నారు. కోర్టు ప్రొసీడర్స్ కు సహకరించే సమయాల్లో కేసు డైరీని పునశ్చరణ చేసుకోవాలని కోరారు. ఎప్పటికప్పుడు లేటెస్ట్‌గా సంబంధిత విషయ పరిజ్ఞానం చాలా అవసరమని, అందుకు నిరంతర అధ్యయనం చేయాలని వారు అన్నారు. నిజామాబాద్ అసిస్టెంట్ పోలీస్ కమిషన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎఫ్ఐఆర్ మొదలుకుని చార్జిషీట్ వరకు తదనంతరం ప్రారంభమయ్యే కోర్టు నేర న్యాయ విచారణ తుది తీర్పు దాకా ప్రాసిక్యూషన్ కు సహకరిస్తామని తెలిపారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మి నర్సయ్య ప్రసంగిస్తూ ప్రతి నెల మొదటి శనివారం అవగాహన కార్యక్రమాలు చేపట్టాడానికి ప్రణాళికలు ఉన్నాయని అన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పిడుగు రవిరాజ్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కవితరెడ్డి తమ ప్రాసిక్యూషన్ అనుభవాలు వివరించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు జగడం నరేష్, విజయ్ బాబు, నరహరి,ప్రతాప్,కోర్టు పోలీస్ డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.

ఆలిండియా ర్యాంకర్‌కు సన్మానం

నవతెలంగాణ-కంఠేశ్వర్

భీంగల్ మండలం చేంగల్ గ్రామానికి చెందిన నంబి శ్రీనివాస్ నంబి శ్రావణ కూతురు నంబి మృదుపాని యూపీఎస్సీ ఇంజనీరింగ్ ఎలక్ట్రానిక్ అండ్ టెలికమ్యూనికేషన్స్ విభాగంలో ఆల్ ఇండియా 21 వ ర్యాంకు సాధించడంతో సన్మానించారు. నిజామాబాదు నగరంలో బ్రాహ్మణ సంఘం సభ్యులురాలు కరుణశ్రీ ఇంట్లో తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం నిజామాబాద్ శాఖ ఆధ్వర్యంలో పూలమాల శాలువా బొకేతో ఘనంగా సత్కరించారు. బ్రాహ్మణ సంగం కోశాధికారి కిరణ్ దేశ్ముఖ్ మాట్లాడుతూ... మృదుపాని యూపీఎస్సీలో ఆల్ఇండియా 21వ ర్యాంకు సాధించడం గర్వకారణమని కొనియాడారు. భవిష్యత్తు లో ఇంకా మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం సభ్యులు ఎం శ్రీనివాసరావు లక్ష్మి నారాయణ భరద్వాజ్ రమేష్ కులకర్ణి పుల్కల్ రమేష్ కులకర్ణి కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఒలంపిక్స్ అధ్యక్ష, ఉపాధ్యక్షులను కలిసిన సర్పంచ్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులను మండలంలోని కేసు పల్లి గ్రామ సర్పంచ్ మైదాం మహేశ్వర్ ఆదివారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఒలంపిక్స్ అధ్యక్షుడు ఈగ సంజీవరెడ్డి, ఉపాధ్యక్షుడు బాజిరెడ్డి జగన్‌ను కేసుపల్లి సర్పంచ్ మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట జర్నలిస్టు మల్లేష్, తదితరులున్నారు.

మాస్టర్‌ప్లాన్ లోపాలను సరిదిద్దాలి



మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నుడా మాస్టర్ ప్లాన్‌లోని లోపాలను సరిదిద్దాలని, అభ్యంతరాలు వ్యక్తం చేసిన వారితో మున్సిపల్ అధికారులు చర్చించాలని నిజామాబాద్ మాస్టర్ ప్లాన్ బాధితుల కమిటీ విజ్ఞప్తి చేసింది. ఆదివారం రేడియో స్టేషన్ ఎదురుగానున్న ఆశ్రమంలో సమావేశమయ్యారు. గాయత్రి నగర్ , రేడియో స్టేషన్, నాగారం రోడ్డు వరకు ప్రతిపాదించిన 100 ఫీట్ల రోడ్డును రద్దుచేసి బాధితులకు న్యాయం చేయాలని , ప్రజల ఆస్తులను కాపాడాలని డిమాండ్ చేశారు. నాగారం రోడ్డు నుండి ఖిల్లా మీదుగా అర్సపల్లి, బోధన్ రోడ్డు వరకు ప్రతిపాదించిన 100 ఫీట్ల రోడ్డు ను ఏ విధంగా రద్దు చేశారో అదే ప్రాతిపదికన నాగారం రోడ్డు వరకు ప్రతిపాదించిన 100 ఫీట్ల రోడ్డును రద్దు చేయాలని కన్వీనర్ కే రామ్మోహన్రావు డిమాండ్ చేశారు. సమావేశంలో ముఖ్య నాయకులు అశోక్, రాములు ,రాజు, పుండరీ, సతీష్, గంగాధర్, విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

న్యూరో సైకియాట్రిక్ ఆధ్వర్యంలో మహాసభలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ ఆధ్యాత్మిక విభాగం ఆధ్వర్యంలో నేడు స్థానిక హైదరాబాద్‌లోని తాజ్ దక్కన్ హోటల్లో అంతర్జాతీయ ఆధ్యాత్మిక న్యూరో సైకియాట్రిక్ విభాగం ఆధ్వర్యంలో మహాసభలను నిర్వహించారు. ఈసభలో అమెరికా, నెదర్లాండ్స్, యునైటెడ్ కింగ్డమ్, బంగ్లాదేశ్, పాకిస్తాన్, నేపాల్, శ్రీలంక నుండి ప్రతినిధులు పాల్గొన్నారు. గౌరవ అతిథిగా నెదర్లాండ్‌కు చెందిన డాక్టర్ పీటర్ మేరగన్ హాజరయ్యారు. బౌద్ధయిజం,



హిందూయిజం, వివిధ మతాల సాంస్కృతికాలపై కూలంకశంగా చర్చించారు. ఇందులో నిజామాబాద్‌కు చెందిన న్యూరో సైకియాట్రిక్ డాక్టర్ ప్రొఫెసర్ ఆకులవిశాల్ బౌద్ధయిజంపై చర్చించారు. వీరితో పాటు హాంకాంగ్, శ్రీలంక నుంచి ప్రతినిధులు చర్చలో పాల్గొన్నారు. గౌరవ అతిథి డాక్టర్ పీటర్ మేరగాన్ డాక్టర్ విశాల్ ఆకులను ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ దేశాలలో నుండి 1000 మందికిపైగా ప్రతినిధులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ ఇండ్లపై మంత్రికి శ్రద్ధ లేదు



ఇండ్లను పరిశీలిస్తున్న సునీల్‌కుమార్

నవతెలంగాణ-మెండోర

మండల కేంద్రంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇండ్లలో ఏమాత్రం పురోగతి లేదని, నాసిరకం పనులు చేస్తూ కాలాన్ని వెళ్లదీస్తున్నారని మంత్రి ప్రశాంత్ రెడ్డి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరేంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల.సునీల్ కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించారు. మంత్రి కమీషన్లు వచ్చే పనులకోసం ఆస్థాయి కాంట్రాక్టర్‌ను పెట్టుకొని చిన్న చిన్న పనులకు కోట్ల రూపాయలు కేటాయించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. పేదలకు ఇళ్ళు కట్టే విషయంలో తక్కువ కమీషన్లు వస్తాయి కాబట్టి ఆయనకు మనసు రావడం లేదని అన్నారు. నియోజకవర్గంలో ప్రతీ ఊరికి డబుల్ బెడ్ రూంలు అవసరం ఉంటే కేవలం మండల కేంద్రాలలో మాత్రమే నిర్మిస్తున్నారని తెలిపారు. తక్షణం డబుల్ బెడ్ రూం ఇళ్ళ నిర్మాణం పూర్తి చేసి అర్హులయిన పేదలందరికి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల కోసం కాకుండా మంత్రి తనకోసం మాత్రమే పని చేసుకుంటున్నారని ప్రజలు అన్నీ గమనిస్తున్నారని అన్నారు. ఆయనకు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సునీల్ సేన సభ్యులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపు బాధ్యత బూత్ సభ్యులదే

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని కమలాపూర్, మిట్టపల్లి, రాంపూర్, నర్సింగ్‌పూర్, కొత్తపేట్ గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీలను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు దాసరి లక్ష్మి నర్సయ్య, ఇంచార్జీ పద్మారావు, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. అన్ని వర్గాల వారికి మేలు చేకూరుస్తూ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్న తెలంగాణ రాష్ట్రం యావత్ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. తెలంగాణలో ఉచిత విద్యుత్, రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలను నిర్విఘ్నంగా అమలు చేస్తున్న ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. సంక్షేమ ఫలాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి ప్రజలతో మమేకమై బూత్ కమిటీ సభ్యులు వారి సత్తా చాటాలన్నారు. రానున్న రోజుల్లో బి ఆర్ ఎస్ పార్టీ గెలుపు కోసం పాటుపడాలని, పార్టీ గెలుపు బాధ్యత బూత్ సభ్యుల పైనే ఉందని అన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న నాయకులు

కార్యక్రమంలో సినియర్ నాయకులు నల్లవెల్లి సాయిలు, ఒడ్డం నర్సయ్య, బాబా, రూరల్ యూత్ అధ్యక్షుడు అమీర్ ఖాన్, సెక్రెటరీ గిరి, సర్పంచులు పాపాయి తిరుపతి, తెలు గణేష్, నడ్పన్న, నర్సయ్య, నాయకులు గణేష్, పోతర్ల రవి, ఎంపిటిసి బాలగంగాధర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు బాల్ బ్యాట్మింటన్ శిక్షణ



శిక్షణకు హాజరైన క్రీడాకారులు

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మామిడిపల్లి గ్రామంలో జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం రెండవ రోజు ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా మండలంలోని అమ్రాద్ గ్రామానికి చెందిన సర్పంచ్ సింగరి లింగన్న క్రీడాకారులను పరిచయం చేసుకొని రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చింత మల్లారెడ్డి, సీనియర్ బాలు బ్యాడ్మింటన్ క్రీడాకారులు కాకతీయ కాలేజ్ లెక్చరర్ సుదర్శన్, పురుషోత్తం పాల్గొన్నారు.

బూత్ కమిటీల ఎన్నికలు పూర్తి

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

ఎలక్షన్లు ఎప్పుడు వచ్చినా ప్రతిపక్షాలను మట్టి కరిపించేదిశగా బూత్ కమిటీ ఎన్నికలు పూర్తి చేశామని, తిరిగి తామె అధికారంలోకి కచ్చితంగా వస్తామని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మీసాల సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ రూరల్ మండల బూత్ కమిటీ ఎన్నికలకు సహకరించిన ఎంపీపీ బానోత్ అనూష ప్రేమ్, జడ్పిటిసి సుమలత గోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, ప్రధాన కార్యదర్శి గుండారం ఎంపీటీసీ అంకాల గంగాధర్, ఎస్టీ సెల్ అధ్యక్షులు బానోత్ గోపాల్ నాయక్, నాయకులకు, బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులకు ధన్య వాదాలు తెలిపారు.



ఎన్నికైన బూత్ కమిటీ నాయకులు

బూత్ కమిటీల ఎన్నిక

నిజామాబాద్ రూరల్ మండలం పార్టీ అధ్యక్షులు మీసాల మధుకర్ రావు ఆధ్వర్యంలో ఆదివారం కొత్తపేట్, గాంధీనగర్ తాండలో ఆయా గ్రామ శాఖ అధ్యక్షులు కె.ఎల్లయ్య, మారయ్య ఆధ్వర్యంలో బూత్ కమిటీలను వేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బానోత్ అనూష ప్రేమ్, జెడ్పిటిసి బొల్లెంక సుమలత గోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, టీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి, ఎంపీటీసీ గంగాధర్, బీఆర్ఎస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు బానోత్ గోపాల్ నాయక్, సొసైటీ చైర్మన్లు పైసా స్వామి, శ్రీధర్, సర్పంచులు లావణ్య ప్రవీణ్ గౌడ్, బాదావత్ అనూష లక్ష్మణ్, రాంగోపాల్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయండి

- ప్రగతి శీల మహిళ సంఘం

నవతెలంగాణ-సిరికొండ

ప్రగతి శీల మహిళ సంఘం రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయాలని ఆసంఘం నాయకులు కోరారు. మండలంలోని రామడుగు గ్రామంలో ప్రగతి శీల మహిళా సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షురాలు పి. లక్ష్మీ అధ్యక్షత వహించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీ, సుభద్ర మాట్లాడుతూ... రాష్ట్ర 3వ మహసభలు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 28, 29తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభలను విజయవంతం చేయాలని మహిళా లోకానికి పిలుపు ఇచ్చారు. ఈ మహసభలో గత ఉద్యమాల సమీక్ష, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటించడం జరుగుతుందని పేర్కొన్నారు. నేడు సమాజంలో మహిళల పట్ల వివక్షత కొనసాగుతుందని అన్నారు. నేటికి పార్లమెంట్‌లో 33శాతంమహిళ రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందలేదని తెలిపారు. ప్రభుత్వాలు స్త్రీల రక్షణకు అనేక చట్టాలను చేస్తున్నామని చెబుతున్న, ఆచరణలో అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులు పెరిగాయని తెలిపారు. స్త్రీలు, పురుషులు సమానమనే భావన, సంస్కృతిని పెంపొందించాలని కోరారు. నరేంద్ర మోడి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత స్త్రీల పట్ల వివక్షత, దాడులు పెరిగాయని అన్నారు. మనువాద సంస్కృతిని పెంచి పోషిస్తున్నారని విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరలు పెంచి ప్రజలపై అధిక భారాన్ని మోపారని అన్నారు. మహసభల విజయవంతానికి మహిళా సంఘం సభ్యులు కృషి చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కమిటీ నాయకులు సవిత, జయక్క, అనిత, యమున, లక్ష్మీ, స్వరూప, శకుంతల, గంగామణి తదితరులు పాల్గొన్నారు.

బినోలలో కంటి వైద్య శిబిరం



కంటిపరీక్షలు చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని బినోల గ్రామంలో శ్రీ ఓం ఆదిశక్తి యేంద్ర స్వామిగల్ ట్రస్ట్ ప్రోత్సాహకంతో లయన్స్ క్లబ్ బోధన్ ఆధ్వర్యంలో రెండో విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరంలో 73 మందికి పరీక్షలు నిర్వహించగా 33 మందికి శస్త్ర చికిత్సకోసం బోధన్ కంటి ఆసుపత్రికి పంపారు. కార్యక్రమంలో సర్పంచ్ పీతాంబర్, ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ సరిత, యంచ సర్పంచ్ లహరి ప్రవీణ్ కుమార్, ఉప సర్పంచ్ పోశెట్టి, సిబ్బంది పాల్గొన్నారు.

క్షత్రియ సమాజ్ కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం

- ప్రమాణం చేయించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని చిన్న బజార్‌లో గల దత్తాత్రేయ లక్ష్మీనారాయణ మందిరంలో ఆదివారం క్షత్రియ సమాజ్ కార్యవర్గ సభ్యులతో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన నిధులలో రూ. 35 లక్షలు కేటాయించానని, మందిర నిర్మాణం ఏడాదిలోగా పూర్తి చేయాలని చెప్పారు. దేశంలోనే ఎక్కడ లేని విధంగా భవ్యమైన మందిరాన్ని నిర్మించాలన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలిసిన సిద్దులగుట్టపై మందిరాన్ని నిర్మించి చిరకాలం గుర్తుండిపోయేలా చేయాలన్నారు. క్షత్రియ సమాజ్ సోదరులు ముందుకు వచ్చి మందిర నిర్మాణనికి సహకరించాలన్నారు. మందిర నిర్మాణానికి తాను ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఏడాది గడువులోగా మందిరాన్ని నిర్మించాలని కార్యవర్గ సభ్యులతో ఎమ్మెల్యే ప్రమాణం చేయించారు. క్షత్రియ సమాజానికి తన తండ్రి అల్జాపూర్ సూర్యప్రకాష్ స్మారకార్థం స్వర్గరథాన్ని ఉచితంగా అందజేస్తానని ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సమక్షంలో అల్జాపూర్ మహేందర్ ప్రకటించారు. పట్టణంలోని సిద్దుల గుట్టపైగల సహస్రార్జున మహారాజ్ మందిర నిర్మాణానికి రూ. 35 లక్షల ప్రొసీడింగ్‌ను సమాజ్



ప్రొసీడింగ్‌కాపీని అందజేస్తున్న ఎమ్మెల్యే

కార్యదర్శి బారడ్ గంగామోహన్ కు ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆశన్న గారి రాజేశ్వర్ రెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్, క్షత్రియ సమాజ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఖాందేశ్ శ్రీనివాస్, కౌన్సిలర్లు సంగీత ఖాందేశ్, బారడ్ రమేష్, టిఆర్ఎస్ నాయకులు పండిత్ పవన్ అల్జాపూర్ మహేందర్ దొండి శ్యామ్, సమాజ్ ఉపాధ్యక్షులు రెడ్డి ప్రకాష్, జెస్సు ఆనంద్ గటడి కిషన్, పండిత్ ప్రేమ్, సంయుక్త కార్యదర్శి బాదం రాజేందర్, హజారి రమేష్, డీకే రాజేష్, సంతని విజయ్, సభ్యులు సాత్ పుతె శ్రీనివాస్, గట్టడి గంగాధర్ బాబు, గతడి సత్యనారాయణ, కర్తన్ దినేష్, అల్జాపూర్ హరికి ఆనంద్, బోచ్ కర్ పాన్ శ్రీనివాస్, రెడ్డి నూతన్ శ్రీనివాస్, మామిడి లక్ష్మీనారాయణ, జెస్సు శ్రీనివాస్, కర్తన్ సిటిఓ శ్రీనివాస్, ఎస్‌జి రాము, డీకే శ్రీహరి, గణేష్ గౌరవ్, కర్తన్ నవీన్, ఖాందేశ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి



హెల్మెట్లు పంపిణీచేస్తున్న భాస్కర్‌రాజ్

నవతెలంగాణ-ఎడపల్లి

బోధన్ కరుణాన్న యువసేన కార్యాలయంలో బోధన్ మండలం కండ్గావ్ గ్రామ యువకులకు హెల్మెట్లను ఎడపల్లి మాజీ ఎంపీపీ, కరుణన్న మిత్రమండలి అధ్యక్షులు రాచర్ల భాస్కర్ రాజ్ ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు కాంగ్రెస్ సీనియర్ నాయకులు కెప్టెన్ కరుణాకర్ రెడ్డి స్వచ్ఛందంగా హెల్మెట్లు పంపిణీ చేయడమే కాకుండా ఐదు సంవత్సరాలలోపు చిన్నారి బాల బాలికలకు దోమతెరలను అందజేయడం హర్షనీయమన్నారు. హెల్మెట్లను వాడితే ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఖలీల్‌ఉల్లా, రాజేశ్వర్ పటేల్, మోసిన్, దత్తు, మల్లికార్జున్, అబ్బయ్య, గ్రామ యువకులు పాల్గొన్నారు.

పాఠశాలలకు స్మార్ట్ టీవీలు, ప్రింటర్ల వితరణ

నవతెలంగాణ-వేల్పూర్(ఆర్మూర్)

మండలంలోని అక్లూర్, మోతే, వేల్పూర్ పాఠశాలల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో స్మార్ట్ టీవీలు, ప్రింటర్లు అందజేశారు, తాము చదువుకున్న స్కూళ్లకు తమ వంతుగా సహకారం అందించాలన్న ఉద్దేశంతో వీటిని ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వేల్పూర్, అక్లూర్, జాగిర్యాల గ్రామాలకు చెందిన సిబలు మోతీరాం, ప్రశాంత్, పరమేశ్వర్, వేల్పూర్, మోతే గ్రామాల సర్పంచులు తీగల రాధామోహన్, చంద్రమోహన్ గౌడ్, ఎంఈఓ వనజ, ప్రధానోపాధ్యాయులు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
సోమవారం 09 జనవరి 2023

లంబాడి ఐక్య వేదిక జిల్లా యూత్ ఇన్‌చార్జిగా అనిల్ నాయక్



నవతెలంగాణ-ఎల్లారెడ్డి

లంబాడి ఐక్య వేదిక కామరెడ్డి జిల్లా యూత్ ఇంచార్జిగా అనిల్ నాయక్‌ను నియమించారు. ఈ మేరకు ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో రాష్ట్ర ముఖ్య సమన్వయ కర్త రమేశ్ నాయక్ జాదవ్ ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ నాయక్ మాట్లాడుతూ తన పై నమ్మకంతో పెద్ద బాధ్యత అప్పగించినందుకు రాష్ట్ర కమిటీకి, జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

10న నాట్య సౌరభ కార్యక్రమం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి తపస్వి సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్, భారతి నృత్యానికేతన్ల ఆధ్వర్యంలో నాట్య సౌరభ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తపస్వి ఫౌండర్ పద్మావతి, చైర్మన్ గంగాధర్, భారతి నృత్యానికేతన్ నాట్య గురువు సరోజ ప్రియదర్శిని సుధీర్ లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10న పట్టణంలోని పెర్కిట్ సిటీ గార్డెన్‌లో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత పవన్ తదితరులు హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

నిధులున్నా.. నిర్వహణ అంతంతే

- అధ్వాన్నంగా మారుతున్న రైతు వేదికలు
- నెలకు రూ.9 వేలు మంజూరవుతున్నా సమస్యల తిష్ట
- నిర్వహణ బాధ్యతలు ఏఈవోలకు అప్పగింత

నవతెలంగాణ-జుక్కల్


చుట్టూ పిచ్చిమొక్కలతో కలవిహీనంగా మారిన నాగల్‌గావ్ రైతువేదిక


తెగిపడి ఉన్న విద్యుత్‌వైర్‌లు

నూతన సాగు విధానాలు, పంట మార్పిడులు తదితర రైతులకు సంబంధించిన విషయాలపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన రైతు వేదికల నిర్వహణ పలు చోట్ల అధ్వాన్నంగా మారింది. నిధులు విడుదలవుతున్నా వాటి ఆలనా పాలన కరువైంది. వాటిని ఉపయోగించుకోకపోవడంతో వాటిని నిర్మించిన లక్ష్యం నీరుగారుతోంది. వీటిని బాధ్యతను ఏఈవోలకు అప్పగించగా.. పలువురు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి రైతు వేదికలను వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రైతులకు ఉపయోగపడేలా క్లస్టర్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించింది. ఈ లెక్కన జుక్కల్ మండలంలో పెద్దఎడ్గి, పెద్దగుల్లా, ఖండేబల్లూర్, నాగల్‌గావ్, జుక్కల్, డోన్గాం, హంగర్గలలో మొత్తం 7 రైతు వేదికలను నిర్మించారు. నిర్మాణాలు పూర్తి చేసుకొని రెండేండ్లు గడుస్తుండగా.. వీటి పరిధిలో ఏడుగురు ఏఈవోలు విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక్కొక్క ఏఈవోకు ఏడు వేల ఎకరాల వ్యవసాయ భూముల పరిధిని ఇదివరకే వ్యవసాయ శాఖ కేటాయించింది. ఏఈవోలు తమకు సంబంధించిన క్లస్టర్ గ్రామాలకు వెళ్లడం, చిన్న, సన్నకారు రైతుల పేర్లు నమోదు చేయడం, సర్వేనెం, అధార్ నెం, ఖరీఫ్, రబీ సీజన్లలో పండించే పంటల వివరాలు క్షేత్రస్థాయిలోకి వెళ్లి నమోదు చేసి రైతుబంధు, రైతు బీమా, పీఎమ్ కిసాన్ యోజన, భూముల వివరాలను క్లస్టర్ పరిధిలోని రికార్డులలో నమోదు చేసి ఉంచాలి.

దీంతో పాటు వారానికి రెండు సార్లు రైతులకు శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేయాలి. ఇలా నెలకు కనీసంగా 8 సమావేశాలు నిర్వహించారు. ఇందుకు గాను రూ.2500 ఖర్చుచకు, విద్యుత్ బిల్లులకు వెయ్యి రూపాయలు, రైతులకు తాగునీరు, నీటి వసతికి ఐదు వందలు, పరసరాల పరిశు భ్రత , కాపలదారునికి మూడూ వేలు, స్టేషనరి, జిరాక్స్ ఇతరములు రూ. ఒక వేయి, నిర్వాహణ ఖర్చులు, మరమ్మత్తులకు గాను మొత్తం కలిపి నెలకు రూ 9 వేలు రాష్ట్ర వ్యవసాయ శాఖ క్లస్టర్ ఏఈవోల బ్యాంకు ఖాతాలో నేరుగా జమచేస్తుంది. ఈ డబ్బులతో రైతు వేదిక నిర్వహణ చూడాల్సి ఉంటుంది. దీని బాధ్యతను సైతం ఏఈవోలకు అప్పగించింది. కనీసం గ్రామాల సర్పంచులకు కూడా రైతు వేదికల నిర్వాహణ నిధులు వచ్చాయని తెలియచేయడం లేదు. పెద్దఎడ్గి, జుక్కల్, నాగల్గావ్, డోన్గాం, పెద్దగుల్లా, ఖండేబల్లూర్ సర్పంచులకు సంప్రదిస్తే తమకేమి తెలియదని వారు తెలిపారు.


పెద్దఎడ్గి రైతు వేదిక పరిసరాల్లో పిచ్చిమొక్కలు


నాగల్‌గావ్ రైతువేదికలో చెత్తతో నిండిపోయిన మరుగుదొడ్డి

అధ్వాన్నంగా రైతు వేదికలు

రైతు వేదికల పరిస్థితి అధ్వానంగా మారింది. నాగల్‌గావ్‌లో విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయి. బోరుబావి ముళ్లకంపల మధ్య నిరుపయోగంగా మారి మూతపడి ఉంది. మరుగుదొడ్లు చెత్తతో నిండి దుర్గందంగా మారింది. పెద్దఎడ్గిలో చుట్టురా పిచ్చి మొక్కలు పెరిగాయి. మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా చేపట్టకపోవడంతో చెత్తతో నిండి నిరుపయోగంగా మారింది. నీటి వసతి అసలుకే లేదు. ఖండేభల్లూర్‌లో సైతం ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నాయి. కనీసం రైతు వేదిక మోహం చూసే వారే కరువైయ్యారు. జుక్కల్, పెద్దగుల్లా, హంగర్గలో సైతం ఇలాంటి పరిస్థితే నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రైతు వేదిక నిర్వహణ సక్రమంగా చేపట్టేలాగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం
ఏడిఏ నూతన్ కుమార్

విధులలో నిర్లక్ష్యం చేస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం. రైతు వేదికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులల్లో అవకతవకలకు పాల్పడితే శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం. రైతు వేదికలను పరిశీలించి సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తాం

గ్రంథాలయంలో ఇరుకు గదులతో ఇబ్బందులు


ఇరుకుగా మారిన గదులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయ ప్రాంగణంలో ఉన్న గ్రంథాలయంలో చదువుకునేందుకు ప్రతిరోజు అనేకమంది వస్తున్నారు. వరుస ఉద్యోగ నోటిఫికేషన్లు వెలువడుతున్న తరుణంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు పోటెత్తుతున్నారు. కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చదువుకునేందుకు గదులు, కుర్చీలు ముఖ్యంగా మూత్రశాలలు సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పురుషులతో పాటు మహిళలకు ఒకే మూత్రశాల ఉండడంతో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. ఈ విషయమై ఆదివారం లైబ్రేరియన్ వరలక్ష్మిని సంప్రదించగా లైబ్రరీలో నెలకొన్న సమస్యలపై ఆర్డిఓ, మున్సిపల్ చైర్‌పర్సన్ల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

కరపత్రాలు పంపిణీ

నవతెలంగాణ-మద్నూర్


కరపత్రాలు అందజేత

మద్నూర్ మండల కేంద్రంలో ఆదివారం ఉదయం ఇంటింటికి కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. నైజం విముక్తి స్వాతంత్ర్య పోరాటానికి 75 ఏళ్ల పేరిట ఉత్సవ సమితి ఆధ్వర్యంలో అందజేశామని ఉత్సవ సమితి సభ్యులు సక్కర్లవార్ నరేష్ తెలిపారు. నిజాం రాజ్యం ఎలా ఏర్పడింది? రజాకర్ల దురాగతాలు, చైతన్యం వెల్లివిరిసిన వేళ, ప్రతి ఘటన, విముక్తి ఉద్యమంలో పోరాట యోధులు, సైనిక చర్య, మన కర్తవ్యం అంశాలు ఉన్నాయని వివరించారు.

రైల్వే స్టేషన్ పునరుద్ధరించాలి

సంతకాల సేకరణ

నవతెలంగాణ-ఎడపల్లి


సంతకాలు సేకరిస్తున్న నాయకులు

ఎడపల్లి రైల్వే స్టేషన్‌నున పునరుద్ధరించాలని ఆదివారం మండలకేంద్రం లో అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. గా జిల్లా నాయకులు గుమ్మల గంగాధర్ మాట్లాడుతూ.. ఎడపల్లి , శక్కర్ నగర్ రైల్వే స్టేషన్లు పునర్నిర్మాణం చేయాలని జనవరి ఒకటో తేదీ నుంచి వారం రోజులపాటు వివిధ రూపాల్లో వినతి పత్రాలు, సంతకాల సేకరణ చేస్తున్నామని అన్నారు. మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ దగ్గర సంతకాల సేకరణ చేశామని తెలిపానే.గా రైల్వే అధికారులకు ఆందోళన చేస్తున్న తెలపడం జరిగింది అధికారులకు చీమ కుట్టినట్లు లేదు బోధన్ పట్టణ ప్రజలకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఎడపల్లి గ్రామ మండల ప్రజలకు తెలపకుండా ఈ రెండు స్టేషనులను ఎత్తివేస్తున్నామని అధికారులు తెలపడం జరిగింది రైలుకు పోయే ప్రయాణికులు ప్రజలకు దూర ప్రాంతాలకు వెళ్లే వాళ్లకు రోజువారి కూలి పని చేసుకునే వాళ్లకు పట్టణానికి వెళ్లే ఉద్యోగస్తులకు విద్యార్థులకు ఈ రైలు సౌకర్యంగా ఉండే గతంలో నైజాం నవాబు శక్కర్ నగర్ ఫ్యాక్టరీ కొరకు రైల్వే లైను ఏర్పాటు చేశారని తెలిపారు. బోధన్ పట్టణ ప్రజల ఏడపల్లి మండల గ్రామ ప్రజల అవసరాల నిమిత్తం పున నిర్మాణం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి షేక్ నసీర్, శ్రీపతి మల్లేష్, మండల నాయకులు సిద్ధ పోశెట్టి, ఎర్రన్న, ఉప సర్పంచ్ ఆకులశ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.


నెంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ద్విచక్ర వాహనాల వారు తూచా తప్పకుండా నియమ నిబంధనలను పాటించాలని, లేకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని మూడో పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు. ఎస్ఐలు శ్రావణ్ కుమార్, నరేష్, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో మూడో పోలీస్ స్టేషన్ పరిధిలోని కంఠేశ్వర్ ప్రాంతంలో ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎఐ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. వాహనానికి తప్పనిసరిగా నంబర్ ప్లేట్లు ఉంచాలని, లేకుంటే సీజ్ చేస్తామన్నారు. నెంబర్‌ప్లేట్, వాహనానికి సంబంధించిన పేపర్లను తీసుకువస్తేనే వాహనాలను ఇస్తామని తెలిపారు.

చెరువులో పడి జీపీ కార్మికుడు మృతి

నవతెలంగాణ-పిట్లం


మృతిచెందిన నవీన్

ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని గౌరారంలో ఆదివారం వెలుగుజూసింది. ఏఎస్ఐ లింబాద్రి వివరాల ప్రకారం.. మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన పందిరి నవీన్ (26) శుక్రవారం గ్రామ పంచాయతీ సఫాయి పని ముగించుకొని ఊర చెరువుకు వెళ్లి కాళ్లు చేతులు కడుక్కుంటుండగా ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి మునిగిపోయాడు. ఆ రోజు నుంచి కుటుంబీకులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా ఆదివారం ఉదయం 8 గంటలకు అదే గ్రామానికి చెందిన పంచాయతీ ఎలక్ట్రిషన్ వర్కర్ గ్రామ చెరువులోని జీపి మోటర్ స్టార్ట్ చేసేందుకు వెళ్లగా చెరువులో నవీన్ మృతదేహం తేలి ఉండటంతో కుటుంబీకులకు, గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. మృతుడి భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

7వ బెటాలియన్‌లో అత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ 7వ బెటాలియన్ లో 1980 లో ఏర్పాటు చేసిన నాటి నుండి నేటి వరకు పనిచేసి రిటైర్మెంట్ అయిన అధికారులు, సిబ్బందికి ఆదివారం అత్మీయ సమ్మేళనం నిర్వహించారు. హైదరాబాద్ నగరంలోని ఉప్పల్ లో ఉన్న ఒక ఫంక్షన్ హాల్లో ఈ అత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది యోగక్షేమాలను అడిగి తెలుసుకుని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో 150 మంది అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మతం ముసుగులో దాడులు సరికాదు

- ఉపాధ్యాయుడిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి
- ప్రజాసంఘాల పోరాటకమిటీ ప్రతినిధుల డిమాండ్
- ఏసీపీకి వినతి

నవతెలంగాణ-బోధన్



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పించి నిరసన వ్యక్తం చేస్తున్న ప్రతినిధులు

కోటగిరి మండలం లోని జిల్లా పరిషత్ హైస్కూల్లో తెలుగు పండితులుగా పనిచేస్తున్న మల్లికార్జున్ అనే ఉపాధ్యాయుడిపై కొంతమంది ఉద్దేశ పూర్వకంగా విధులకు ఆటంకం కలిగించి, దాడిచేసి అవమానపరచారని వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల పోరాట కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం బోధన్ పట్టణంలో అంబేద్కర్ చౌరస్తాలో కమిటీ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు భవిష్యత్ కార్యక్రమం రూపొందించారు. అనంతరం బోధన్ ఏసిపి కిరణ్ కుమార్ కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మతం ముసుగు లో కొందరు దాడులకు పాల్పడుతూ అవమానకరమైన రీతిలో వ్యవహరిస్తున్నారని అన్నారు. మతతత్వ వాదులు పాఠశాలలో చొరబడి ఉపాధ్యాయులపై దాడులకు తెగపడుతున్నందున ఉపాధ్యాయులు, స్వేచ్ఛగా పాఠాలు చెప్పగలిగే వాతావరణం లేకుండా పోయిందని వాపోయారు. ఉపాధ్యాయుడు మల్లికార్జున్ సరస్వతి దేవిని నిందించారని ఆరోపిస్తూ ఉపాధ్యాయుడిని ఊరేగింపుగా గుడికి తీసుకవెళ్లి బొట్టు పెట్టి క్షమాపణ చెప్పించి అవమానించారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి మతం ముసుగులో చెలరేగిపోతున్న అరాచక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యాసంస్థలో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని కోరుతున్నాము. ఇలాంటి సంఘటనలు పున్హరావృతం కాకుండా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు యానం విజయ్ కుమార్, లింగన్న, తుకారాం, కందరే శంకర్, విటల్, దేవేందర్, సంజీవ్, ఈశ్వర్, వెంకట్, యాట ప్రతాప్, సురేష్ ,అక్బర్, మధుకర్, విజయ్ పాల్గొన్నారు.

పర్సనల్ పనులకు.. పంచాయతీ ట్రాక్టర్

- సొంత పనులకు వాడుకుంటున్న పోచారం సర్పంచ్
- ప్రశ్నిస్తే దబాయిస్తున్నారని గ్రామస్తుల ఆరోపణ

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్


గ్రామపంచాయతీ ట్రాక్టర్‌లో సెంట్రింగ్ చెక్కలు తరలిస్తున్న దృశ్యం

రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం లక్షల రూపాయలు వెచ్చించి అందజేసిన ట్రాక్టర్‌ను కొందరు సర్పంచులు తమ స్వంత పనులకు ఉపయోగించుకుంటూ దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే పెద్దకొడప్‌గల్ మండలంలోని పోచారం గ్రామపంచాయతీకి చెందిన ట్రాక్టర్‌పై సెంట్రింగ్ చెక్కలను ఆదివారం దర్జాగా తరలించారు. గతంలో సైతం వరి, వరిగడ్డి రవాణా కొరకు గ్రామపంచాయతీకి చెందిన ట్రాక్టర్‌ను ఉపయోగించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కామారెడ్డి జిల్లా కలెక్టర్ గ్రామాల పర్యటనకు వచ్చినప్పుడు గ్రామపంచాయతీకి చెందిన ట్రాక్టర్‌ను కేవలం హరితహారం మొక్కల తరలింపు, వాటి నీటి అవసరాలకు, చెత్త తరలింపు ఇతరాత్ర పంచాయతీ పనులకు మాత్రమే ట్రాక్టర్‌ను ఉపయోగించాలని సూచించినప్పటికి కొందరు సర్పంచులు గ్రామపంచాయతీలో తమదే పెత్తనం ఉందంటూ, తమకు అడ్డు చెప్పేవారు ఎవరంటూ తమ ఇష్టానుసారం గ్రామపంచాయతీ ట్రాక్టర్‌ను ఉపయోగించుకుంటున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. మరికొన్ని గ్రామాల్లో సర్పంచు పెత్తనంతో గ్రామపంచాయతీ ట్రాక్టర్‌ను ఇతరులకు అద్దెకు సైతం ఇచ్చినట్లు తెలుస్తుంది. ఈ వ్యవహారం గురించి ఎవరైనా గ్రామపెద్దలు సర్పంచును ప్రశ్నిస్తే పంచాయతీ ట్రాక్టర్‌ను వాడుకోవచ్చు అని సమాధానం చెపుతున్నారు. ఏది ఏమైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామాలను మరింత పచ్చని హరితవనాలుగా మార్చాలని, గ్రామాల్లో ఎలాంటి మౌళిక ఇబ్బందులు లేకుండా ఉండేలా పల్లెప్రకృతివనం, కంపోస్టుషెడ్డు, డంపింగ్‌యార్డు, వైకుంఠధామాలు, మంకీ ఫుడ్‌కోర్టులు వంటివి ఏర్పాటు చేసి వాటి అవసరాలకు అనుగుణంగా ట్రాక్టర్‌ను పంపిణీ చేయగా సర్పంచుల పెత్తనం కారణంగా ప్రభుత్వ ఉద్దేశ్యం, లక్ష్యం నీరుగారిపోతుందని పలువురు బహిరంగంగా సర్పంచుల తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విచారణ చేపట్టి ట్రాక్టర్‌లను తమ సొంత పనులకు వినియోగించుకుంటున్న సర్పంచ్‌లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం
పెద్దకొడప్‌గల్, ఎంపీఓ సూర్యకాంత్

పెద్దకొడప్‌గల్ మండలంలోని పోచారం గ్రామపంచాయతీ ట్రాక్టర్‌ను స్వంత పనులకు సర్పంచు వాడుకుంటున్నాడన్న విషయంపై సంబంధిత మండల పంచాయతీ అధికారి సూర్యకాంత్‌ను వివరణ కోరగా పంచాయతీ సర్పంచు, కార్యదర్శిపై విచారణ చేపట్టి శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీఓ సమాధానమిచ్చారు.

విద్యతోనే స్త్రీ సాధికారత


- ఉత్తమ ఉపాధ్యాయినులకు సావిత్రిబాయి పూలే పురస్కారం ప్రదానం


ప్రశంసాపత్రాలతో ఉపాధ్యాయినులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

సావిత్రిబాయి పూలే జయంతి పురస్కరించుకొని జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయునులకు సావిత్రిబాయి పూలే పురస్కార అవార్డులను భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి మాదాసు స్వామి యాదవ్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర ఉపాధ్యక్షులు యెండల లక్ష్మీనారాయణ హాజరై మాట్లాడారు. స్త్రీ అభివృద్ధి సాధికారత విద్యా ద్వారానే కలుగుతుందని, అలాగే సమాజంలో స్త్రీల పట్ల ఉన్నటువంటి వివక్ష తొలగిపోవడం విద్య ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని అన్నారు. అంటారానితనం స్త్రీ పునర్వివాహం లాంటి అంశాలపై పోరాటం చేసిన అభ్యుదయవాది సావిత్రి భాయి పూలే అని అన్నారు. ఈ కార్యక్రమానికి అల్జాపూర్ శ్రీనివాస్ (అదిలాబాద్ ఇంచార్జ్), జిల్లా అధ్యక్షులు బసవ లక్ష్మీనారాయణ పాల్గొని ప్రసంగించారు. 30 మంది ఉత్తమ ఉపాధ్యాయినులకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బద్దం లింగారెడ్డి, ఒబిసి మోర్చా జిల్లా ఇంచార్జ్ శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శీల శ్రీనివాస్, మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఇప్పకాయల కిషోర్, ప్రధాన కార్యదర్శి నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఆర్‌లో గెట్‌టుగెదర్



నృత్యం చేస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎస్ఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థుల గెట్ టుగెదర్ పార్టీ 2023ను రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి యల్. రఘురాజ్ హాజరై విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని కోరారు. విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ చాలా ముఖ్య దశ అని, భవిష్యత్తుకు పునాది అని పేర్కొన్నారు. ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ యం. మారయ్య గౌడ్ మాట్లాడుతూ.. తమ సంస్థ ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహిస్తుందని, 95 శాతం పైగా మార్కులు వచ్చిన వారికి ఉచిత విద్యను అందిస్తామని తెలిపారు. నైతిక విలువలతో కూడిన విద్యను అందించడమే తమ సంస్థ లక్ష్యమని అందుకు నిరంతరం కృషి చేస్తామని అన్నారు. ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులకు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. "రైతే రాజు", కరోనాతో జాగ్రత్త "భక్తి నృత్యం"ను ప్రదర్శించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ హరిత , ప్రిన్సిపల్ డాక్టర్ యస్. రవీందర్ గౌడ్ , అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుదినం జనపక్షం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి

సోమవారం 09 జనవరి 2023

అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమ్మయ్యకు సన్మానం

నవతెలంగాణ-బోధన్



బోధన్ కోర్టులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన న్యాయవాది డాక్టర్ పల్నాటి సమయ్యను ఆదివారం బోధన్ మండల బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు. కార్య క్రమంలో మాజీ మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ బుద్దె రాజేశ్వర్, బోధన్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ వెంకటేశ్వరరావు దేశాయ్, ఎన్డీసీసీ బ్యాంక్ డైరెక్టర్ శరత్, బోధన్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నరసయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సాలూర షకీల్, ప్రధాన కార్యదర్శి సిర్ప సుదర్శన్, యూత్ నాయకులు గణేష్ పటేల్, బెల్లాల్ గ్రామ ఇన్చార్జ్ సర్పంచ్ రమావత్ రాజు, నాయకులు బుర్రి లక్ష్మణ్, జంగిటి శ్రీనివాస్, రాజేందర్ పాల్గొన్నారు.

చెరువులో పడి మహిళ మృతి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



మతిస్థిమితం లేని మహిళ చెరువులో పడి మృతి చెందింది. ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం.. మండలంలోని తొర్లికొండ గ్రామానికి చెందిన పసుల మల్లు (55) ఈమెకు మతిస్థిమితం లేక గ్రామంలో తిరుగుతూ ఉండేది. శనివారం రాత్రి ఇంటి నుంచి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారని పేర్కొన్నారు. గ్రామంలోని పత్తికుంట చెరువులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందిందని తెలిపారు. మృతురాలి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కాటికాపరులకు రూ.10వేలు జీవనభృతి ఇవ్వాలి

- హెల్త్ కార్డు, జీవిత బీమా, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇప్పించాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

మాలబ్యాగరి కాటికాపరుల కులవృత్తిని నమ్ముకొని జీవిస్తున్నారని, వారికి ప్రభుత్వ పరంగా హెల్త్ కార్డు ఇవ్వాలని, జీవనభృతి రూ.10వేలు, జీవిత భీమా క్రింద రాష్ట్ర ప్రభుత్వం నుండి 10 లక్షలు, కేంద్ర ప్రభుత్వం క్రింద 10 లక్షలు ఇవ్వాలని, మృతి చెందిన వారి దహన సంస్కారాలకు రూ. 10వేలు, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇప్పించాలని, సమస్యలను పరిష్కరించాలని మాల బేగరి కాటికాపరుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఎత్తపు కేశవులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంతోపాటు జిల్లాస్థాయి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వృత్తిపై ప్రతి గ్రామంలో ఉన్న 20 కుటుంబాలు జీవిస్తున్నాయని, వారికి ఎలాంటి ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని అన్నారు. ఒక మనిషి చనిపోతే పాడె కట్టడంనుంచి దహన సంస్కారాలు చేసేంత వరకు పనిచేస్తామన్నారు. తమకు పూట గడవని పరిస్థితి నెలకొందన్నారు. ఎక్స్ గ్రేషియా రాష్ట్ర ప్రభుత్వం నుండి 10 లక్షలు, కేంద్ర ప్రభుత్వం నుండి 10 లక్షల చొప్పున ఇవ్వాలని కోరారు. సబ్సిడీ రుణాలకు అవకాశవ ఇవ్వాలని అన్నారు. చనిపోయిన వారికి 10 లక్షల (జీవిత భీమా) చనిపోయిన 10 రోజులలోపు ఇవ్వాలని, బస్సులలో 75శాతం సబ్సిడీతో బస్సు పాసు సౌకర్యం, రైళ్లల్లో ఉచిత పాసు సౌకర్యం కల్పించాలన్నారు. ఇండ్లు లేని వారికి డబుల్ బెడ్రూమ్ ఇండ్లు, 3 ఎకరాల చొప్పున భూములు మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా సఖి గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా లావణ్య, గౌరవ అధ్యక్షులుగా విజయకుమార్, ఉపాధ్యక్షులుగా ప్రభంజై, క్యాషియర్‌గా అనిల్, నగర అధ్యక్షునిగా బ్యాగరీ అనిల్‌ను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న కేశవులు

టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

నవతెలంగాణ-కంఠేశ్వర్

కౌండిన్య పోలీస్ అకాడమీ సుధాపల్లి నిజామాబాద్‌లో నిజామాబాద్ జిల్లా టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈమేరకు ఆదివారం కార్యవర్గ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా లింబారెడ్డి ముఖ్యఅతిథిగా నిజామాబాద్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, ఎన్నికల రిటర్నింగ్ అధికారి యాకుబ్, రాష్ట్ర టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ కన్వీనర్ బ్రహ్మానందం, రాష్ట్ర టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ నిర్వహణ కార్యదర్శి జానకిరామ్, డీవైఎస్ఓ నిజామాబాద్ పరిశీలకులుగా ప్రశాంత్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ పరిశీలకులుగా రాజాగౌడ్ పాల్గొన్నారు. నిజామాబాద్ జిల్లా టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ 2023-2026 కు గాను నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. రిటర్నింగ్ ఎన్నికల అధికారి యాకూబ్ గారు ప్రస్తుత కార్యవర్గాన్ని రద్దు చేస్తూ కొత్త కార్యవర్గాన్ని నియమించారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ జిల్లా టీజీ పేట అధ్యక్షులు గోపి రెడ్డి, ప్రధాన కార్యదర్శి రత్నాల రాజాగౌడ్, కోశాధికారి కస్తూరి శ్రీనివాస్, నిర్వహణ కార్యదర్శి గంగాదాస్, సభ్యులు ప్రసాద్ , మహేందర్, కోకో అసోసియేషన్ ఉపాధ్యక్షులు రాజ్ కుమార్, కామారెడ్డి జిల్లా ఎస్ జి ఎఫ్ కార్యదర్శి రసూల్, నిజామాబాద్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షులుగా జె రాజేశ్వర్, ఉపాధ్యక్షులుగా రాజాగౌడ్, గోపిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గన్న గంగాదాస్, సంయుక్త కార్యదర్శులు గా శ్రీనివాస్, సంజీవరెడ్డి, కోశాధికారి గా బి మహేందర్, నిర్వహణ కార్యదర్శులుగా రాజేందర్, రాజాగౌడ్, రాజ్ కుమార్, ఈసీ మెంబర్స్‌గా ముత్తెన్న, సాయినాథ్, పావని తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, డిసిసి డెలిగేట్లతో సమావేశం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ భవన్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి అధ్యక్షతన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, డిసిసి డెలిగేట్లతో హాత్ సే హాత్ జోడో అభియాన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పిసిసి ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హందాన్ , పిసిసి ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల వద్దకు వెళ్లి వారితో కలిసి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు వెళ్లడానికి హాత్ సే హాత్ జోడో కార్యక్రమం ఈనెల 26 నుండి నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పార్టీ నాయకులు గ్రామ గ్రామాన పాదయాత్రలు నిర్వహిస్తూ గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేయబోయే పనులను ప్రజలకు వివరిస్తామని చెప్పారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రతి బూత్ లో వాట్సాప్ గ్రూపులు తయారు చేయాలని, 10న బ్లాక్ స్థాయిలో హాత్ సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమం సమావేశాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పగంగారెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షులు రాజ నరేందర్ గౌడ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వేణు రాజ్, మైనారిటీ జిల్లా అధ్యక్షులు ఇర్ఫాన్ అలీ, ప్రభ గండ కమిటీ జిల్లా చైర్మన్ జావిద్ అక్రమ్, మాజీ పిసిసి కార్యదర్శులు రాంభూపాల్, రామకృష్ణ, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అంతిరెడ్డి రాజారెడ్డి, మండలాల అధ్యక్షులు, డీసీసీ డెలిగేట్లు పాల్గొన్నారు.

ధరణి పోర్టల్‌ను రద్దుచేయాలి

- సిపిఐ ఎంఎల్ ప్రజాపాందా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

నవతెలంగాణ-ఆర్మూర్

ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలని, ఏక మొత్తంలో రుణమాఫీ అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కోటగిరి ప్రభుత్వ ఉపాధ్యాయుడు మల్లికార్జున్ పై దౌర్జన్యానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. కామారెడ్డి జిల్లాలో రైతాంగం సాగు చేసుకుంటున్న భూముల్లో పారిశ్రామిక క్యారిడార్ చేస్తామని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఇది కేవలం కొద్ది మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అధికార పార్టీ నేతల లబ్ధికోసం చేస్తున్నదని ఆరోపించారు. రైతులతో, రైతు సంఘాలతో, రాజకీయ పార్టీలతో కనీసం చర్చించకుండా మాస్టర్ ప్లాన్ పేరుతో రైతుల భూములను లాక్కుంటే రైతులు, ప్రజలు, ప్రజా సంఘాలు చూస్తూ ఊరుకోవని హెచ్చరించారు. తమ భూముల రక్షణ కోసం రైతులు చేస్తున్న పోరాటానికి ప్రజాపంథా పార్టీ సంపూర్ణ సంఘీభావం తెలియజేస్తుందన్నారు. రైతులతో చర్చించి, వారి వ్యవసాయ భూములకు నష్టం కాకుండా అభివృద్ధి పనులు చేయాలన్నారు. కోటగిరి జెడ్‌పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై ఆర్ఎస్ఎస్, బీజేపీ మనువాద శక్తుల దౌర్జన్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. ఈ ఘటనకు పాల్పడిన వారిపై, ఘటనలో ప్రేక్షక పాత్ర వహించిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకువచ్చి ప్రజలను, రైతులను అనేక గందరగోళాలకు గురిచేసిందన్నారు. భూ సమస్యలు పరిష్కారం కోసం కోర్టులు, ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ ప్రజలు తిరుగుతున్నారని ఆరోపించారు. ధరణి పోర్టల్ భూస్వాములకు వరంగా, సామాన్య పేద ప్రజలకు సమస్యల నిలయంగా మారిందన్నారు. అనేక సమస్యలకు కారణం అవుతున్న ధరణిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రైతుప్రభుత్వం అని చెప్పుకుంటున్న కసిఆర్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తానని వాయిదాల పర్వం కొనసాగిస్తుందన్నారు. ఏక మొత్తంలో తక్షణమే రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ (ఎం.ఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ, రాష్ట్ర నాయకులు వి. ప్రభాకర్ జిల్లా నాయకులు ఎం.నరేందర్, బి.దేవారం, ఎం. వెంకన్న, డి.రాజేశ్వర్, బి.మల్లేష్, పి.రామకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పోటు రంగారావు

ఇంజనీరింగ్ కళాశాలలో క్రిప్టోగ్రఫీపై అవగాహన



నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూరు ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న రెండు రోజుల వర్క్ షాప్ లో భాగంగా ఆదివారం వివిధ సంస్థల్లో పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ నిపుణులు క్రిప్టోగ్రఫీ అంశాల పైన చాలా విస్తృతంగా ప్రసంగించారు. ఎయిర్ ఫోర్స్ రిటైర్డ్ వింగ్ కమాండర్ జి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ.. వివిధ క్రియాశీల వెబ్‌సైట్ల సర్వర్ల పైన హ్యాకర్లు దాడి చేయకుండా క్రిప్టోగ్రఫీ ఎలా నియంత్రిస్తుందో వివరించారు. ముఖ్యంగా వ్యూహాత్మక రంగాల్లో, ఆర్థిక రంగాల్లో డేటాని పదిలపరచడం ఎలాగో డిజిటల్ ఎవల్యూషన్, హ్యాకింగ్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రఫుల్ల కుమార్ మాట్లాడుతూ క్రిప్టోగ్రఫీ నీ బ్యాంకింగ్ రంగంలో ఆర్థిక సమాచార భద్రపరిచేందుకు ఉపయోగిస్తారని, ఇటీవల కాలంలో ట్రెండింగ్ లో ఉన్న బిట్ కాయిన్ వంటి క్రిప్టో కరెన్సీ గురించి, దానిలో వినియోగించే బ్లాక్ చైన్ టెక్నాలజీ గురించి దాని విశిష్టత గురించి, ఆర్బీఐ విడుదల చేసిన డిజిటల్ రూపీ గురించి వివరించారు. .కళాశాల సెక్రటరీ అల్జాపూర్ దేవేందర్ మాట్లాడుతూ ఆధునిక యుగంలో క్రిప్టోగ్రఫీని కంప్యూటర్ సైన్స్, కమ్యూనికేషన్స్‌లో వినియోగిస్తున్నారని, కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డా. రామ్ కింకర్ పాండే మాట్లాడుతూ ఈ వర్క్ షాప్ లో 350 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు

ఉపాధ్యాయునిపై దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

డీటీఎఫ్ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఉపాధ్యాయుని విధులకు ఆటంక పరుస్తూ దాడి చేసి అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలని నిజామాబాద్ జిల్లా డీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ నెల 2న కోటగిరి ఉన్నత పాఠశాలలో మల్లికార్జున్ అనే ఉపాధ్యాయునిపై దాడి చేసి కులం పేరుతో దూషించి అవమాన పరచడమే కాక ఆ ఉపాధ్యాయున్ని ఒక దేవాలయానికి తీసుకెళ్లి అవమానాలకు గురిచేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేసి చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి త్వరితగతిన విచారణ జరిపి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ఆర్ డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.శంతన్ మాట్లాడుతూ.. అరాచక శక్తుల మూలంగా భవిష్యత్తులో పాఠ్యాంశాలను శాస్త్రీయ దృక్పథంతో బోధించలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షులు ఎం బాలయ్య మాట్లాడుతూ దీర్ఘకాలంగా బదిలీలు, పదోన్నతులు లేక ఉపాధ్యాయుల తీవ్ర ఆందోళన చెందు తున్నారని, అనేక పాఠశాలలో సబ్జెక్టు టీచర్ల కొరత తీవ్రంగా ఉందని అన్నారు. దీంతో అన్ని సబ్జెక్టులను బోధించలేని పరిస్థితి ఏర్పడిందని, బదిలీలు పదోన్నతులతోపాటు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నింటిని భర్తీ చేయాలని, పి ఆర్ సి ఏరియార్స్ ను తక్షణమే చెల్లించాలని, అన్ని రకాల బిల్లుల చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాజన్న మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఒకటవ పిఆర్సి గడువు ఈ సంవత్సరం జూన్ 30తో ముగుస్తున్నందున రెండవ పిఆర్సి 2023 జూలైతో అమలు చేయవలసి ఉన్నందున తక్షణమే ప్రభుత్వం స్పందించి రెండవ పిఆర్సి కమిషన్ ఏర్పాటుకు తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. జిల్లాలో జరిగిన అక్రమ డిప్యూటేషన్లు తక్షణమే రద్దు చేయాలని, 317 జీవోతో నష్టపోయిన ఉపాధ్యా యులకు న్యాయం చేయాలని, అప్పీళ్లను సత్వరం పరిష్కరించాలని తెలిపారు. విద్యా సంవత్సరం ముగిస్తున్న ప్పటికీ ఏకరూప దుస్తులు పూర్తిస్థాయిలో అందించలేదని తక్షణమే అందించాలని పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు కె.ఓమాజి, పి.దాసు, కార్యదర్శులు రాందాస్, అరుణ్ కుమార్ , తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ సంస్థానం ద్వారా
డాక్టర్ బోచ్కర్ ఓమ్‌ప్రకాశ్‌కు సన్మానం



ఓమ్‌ప్రకాష్‌ను సన్మానిస్తున్న ప్రముఖులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

కామారెడ్డి జిల్లా దోమకొండ సంస్థానం ద్వారా దోమకొండ ప్రభువులు కామినేని అనిల్ కుమార్ ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మండల కేంద్రానికి చెందిన పద్య కోకిల అష్టావధాని డాక్టర్ బోచ్కర్ ఓం ప్రకాష్‌ను ఘనంగా సన్మానించారు. ఈమధ్యనే దోమకొండ కోటకు యునెస్కో గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా దోమకొండ సంస్థానం వారసులు కామినేని అనిల్ కుమార్, అక్కడ సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా దోమకొండ సంస్థానం సాహిత్య వైభవం కార్యక్రమంలో కవిసమ్మేళనం నిర్వహించే అవకాశం జక్రాన్ పల్లికి చెందిన బోచ్కర్ ఓమ్‌ప్రకాష్ కల్పించారు. ఈ కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించి తన గాన మాధుర్యంతో ఆచార్యులను కవి పండితులను మెప్పించారు. ఉభయ రాష్ట్రాలనుండి కవిపండితులు, సంస్థాన ప్రస్తుత వారసులు కామినేని అనిల్ కుమార్ కేవీ రమణాచారి (ప్రభుత్వ ప్రధాన సలహా దారు), ఆచార్య కసిరెడ్డి, ఆచార్య బేతవోలు పద్మభూషణ్, జికెఐ వరప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

బడీడు పిల్లలు బడికి దూరం

- బాలకార్మికులుగా వలసకార్మికుల పిల్లలు
- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్ నగరానికి మహారాష్ట్ర నుండి బీదర్, బీహార్, రాజస్థాన్ నుండి ఎందరో పేద ప్రజలు రెక్కాడితే గాని డొక్కాడని ప్రజలు వలస వచ్చి జీవనోపాధి పొందుతున్నారు. ఇక్కడ బొమ్మలు, గాజు వస్తువులు, పింగాణి వస్తువులను తయారు చేసి నిజామాబాద్ నగరంలో విక్రయిస్తున్నారు. తద్వారా వారికి రోజుకు 300 రూపాయల నుండి 400 వరకు సంపాదించు కుంటున్నారు. ఇలాంటివారు నిజామాబాద్‌లో కొన్ని సంవత్సరాల నుండి ఆశ్రయం పొందుతున్నారు. వారి పిల్లలు చదువుకోవడం లేదు. ఇంకా వారు బాల కార్మికులుగానే మిగిలి పోతున్నారు. వారికి స్వచ్ఛంద సంస్థలు గాని, ప్రభుత్వం గాని సహాయ సహకారాన్ని అందించి విద్యను అందించాలి. సారంగాపూర్‌లో మైదాన ప్రాంతంలో నివసిస్తున్నారు. చలికి, ఎండకు, వానకు ఇబ్బందులు పడుతున్నారు. వారికి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.



తల్లిదండ్రులతోనే ఉంటున్న చిన్నారులు

విద్యార్థులకు సైకిళ్లు వితరణ



సైకిళ్లు అందజేసిన 2009బ్యాచ్ సీఐలు, ఎస్ఐలు

నవతెలంగాణ-వేల్పూర్(ఆర్మూర్)

విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఉమ్మడి జిల్లా 2009 బ్యాచ్ సిఐలు, ఎస్సైలు పేర్కొన్నారు. ఆదివారం వేల్పూర్ మండల కేంద్రంలో సొంత గ్రామం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాలకు చెందిన 40 మంది పేదవిద్యార్థులకు సైకిళ్లను వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము చదువుకున్న రోజుల్లో సొంత గ్రామాల నుండి కాలినడకన హైస్కూల్ ఉన్న గ్రామాలకు వెళ్లేవారమన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు చాలా సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని, వాటిని ఉపయోగించుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని కోరారు. చదువులో ప్రతిభగల పేద విద్యార్థులకు అండగా ఉంటామన్నారు. సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని, సరదాకు పోయి సైబర్ వలలో చిక్కుకోవద్దని సూచించారు. పిల్లలను స్మార్ట్ ఫోన్లకు దూరంగా ఉండే విధంగా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వనజ, సర్పంచ్ తీగల రాధా మోహన్, వేల్పూర్, మోతే, పచ్చల నడు కూడా హైస్కూల్ల హెడ్మాస్టర్లు రాజన్న లింగన్న సురేష్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు గంట అశోక్ ఇతర ఉపాధ్యాయులను శాలువా మెమోంటోతో ఘనంగా సన్మానించారు.

బ్యాట్ పట్టి ఉత్సాహపరిచి ఎమ్మెల్సీ సతీమణి



బ్యాటింగ్ చేస్తున్న ఆయేషా

నవతెలంగాణ-బోధన్

సాలురా మండల కేంద్రంలో సంక్రాంతి సంబ రాలను పురస్క రించుకొని సాలూర సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీజన్-2 క్రికెట్ టోర్న మెంట్‌ను ఆదివారం ఎమ్మెల్యే షకీల్ అమీర్ సతీమణి ఆయేషా ఫాతిమా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె బ్యాట్ చేతబట్టి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం మాట్లాడుతూ.. పండగ సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. క్రీడలలో గెలుపోటములు సహజమేనని కావున నైపుణ్యంతో విజయం సాధించడానికి ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రకళ, ఎంపీటీసీ సవిత, మాజీ ఉపసర్పంచ్ ఖదీర్, వెంకట్ పటేల్, ఫతేపూర్ సర్పంచ్ అమీర్ పలు గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు.

మస్కట్‌లో చిక్కుకున్నవారిని రప్పించండి

- విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రిని కలిసిన కోటపాటి

నవతెలంగాణ-ఆర్మూర్

మస్కట్ లో చిక్కుకున్న తెలంగాణ బిడ్డలను ఇండియాకు రప్పించాలని కోటపాటి నరసింహం కోరారు. ఇండోర్ లో జరుగుతున్న ప్రవాసి భారతీయదివస్ లో పాల్గొంటున్న విదేశీ వ్యవహారాల శాఖ సహాయమంత్రి మురళిధరన్‌ను కోటపాటి నరసింహం నాయుడు ఆదివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దేవర్ల శేఖర్ కొత్తపెల్లి. మక్లూరు మండలం , బట్టు భోజెందర్ ఉమ్మడ, నందిపేట్, మాచర్ల రవీందర్‌ను చిక్కెల స్వామి అనే ఏజెంట్ మోసగించారని తెలిపారు. మస్కట్‌లో ఉద్యోగం లేక నాలుగు నెలలుగా ఉండటం వల్ల ఇండియాకు రావాలంటే లక్షా 20వేలు వేలు జరిమానా కట్టాల్సివస్తుందన్నారు. వారిని జరిమానా లేకుండా ఇండియాకు రప్పించాలని కోరారు. ఒమన్ దేశంలో పాలకులతో మాట్లాడి త్వరలో రప్పిస్తానని హామినిచ్చారు.మలేషియాలో అనేక మంది జైళ్లలో ఉన్న వారిని ఇండియకు రప్పించాలని కోరారు.గుగులోతు సంతోష్ మనాల, తోటికోల ప్రవీణ్ కుమార్, మాలవత్ దేవేందర్ ను మలేషియలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రవాసి భీమాయోజన జీవితబీమాగా మార్చాలని కోరినట్టు తెలిపారు. జాతీయస్థాయిలో ప్రవాసి వెల్ఫే బోర్డ్ ఏర్పాటు చెయ్యాలని కోరారు. అన్నింటికి కూడ సానుకూలంగా స్పందించినట్టు ఆయన తెలిపారు.

పచ్చదనం... ఈ పోషణవనం



నవతెలంగాణ-బోధన్

మండలంలోని హంగర్గ గ్రామంలో గల అంగన్ వాడీలో పెంచుకున్న పోషణవనంలో ఆకుకూరలు ఏపుగా పెరిగాయి. ఈ తాజా కూరలు పిల్లలకు అందిస్తున్నారు. అంగన్వాడీ కార్యకర్త సరిత, సిబ్బంది వినోద ఆకుకూరలు, వంకాయ, బెండకాయ వంటి మొక్కలను కాపాడుతూ అంగన్వాడీలో నాణ్యమైన భోజనం అందిస్తున్నారు.